www.aksharadarbar.com
గురువారం 10, అక్టోబర్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :210 | పేజీలు : 05 | వెల : 05

పోయి రావమ్మా..

పల్లెలను ప్రేమించి.. పువ్వులను పూజించి.. ప్రకృతిని ఆరాధించే... గొప్ప సాంస్కృతిక వైభవం సద్దుల బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఆడపడుచులంతా ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపమైన వేడుకలు అంబరాన్నంటాయి. ఈనెల 2న ఎంగిలపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం ఊరూవాడా ఉయ్యాల పాటలతో మారుమోగాయి. పూల సింగిడి నేలకు దిగిందా అన్నట్టుగా.. పల్లెపట్నం బతుకమ్మలతో మురిసిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబురం అత్యంత వైభవంగా కన్నులపండువగా సాగింది. హన్మకొండలోని పద్మాక్షమ్మ గుండంలో మహిళల కోలాహలం నెలకొంది. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. రాజధాని పూలవనంగా మారిపోయింది. బతుకమ్మలతో అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. - అక్షరదర్బార్, హన్మకొండ

- తెలంగాణలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురం
- ఊరూవాడా మార్మోగిన ఉయ్యాల పాటలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కన్నులపండువగా వేడుకలు
- హన్మకొండ పద్మాక్షమ్మ గుండంలో సందడి
- మహిళల ఆటపాటలతో కోలాహలం
- ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన సంబురాలు
- అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ
- తొమ్మిది రోజులపాటు వైభవంగా వేడుకలు

వివరణ ఇవ్వండి

- మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు
- నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో జారీ
- రెండో సాక్షి స్టేట్ మెంట్ రికార్డు చేసిన కోర్టు
- తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా

03

రిలీవ్..

- ఏపీకి ఐదుగురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ ల బదలాయింపు
- ఈనెల 16లోగా రిపోర్ట్ చేయాలని కేంద్రం కీలక ఆదేశాలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి స్థానచలనం

06

సురేఖపై కేటీఆర్ పరువు నష్టం దావా..

నాంపల్లి కోర్టులో విచారణ

03

గౌడన్నలకు కాంగ్రెస్ చేయూత

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ

02

ఘనంగా నిట్ వార్షికోత్సవం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ (ఏఎల్సీ)లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ లోని డీఆర్డీవోలో శాస్త్రవేత్త, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ రాజాబాబు హాజరై మాట్లాడారు.

- అక్షర దర్బార్ , హన్మకొండ

02

బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- నెక్కొండ మండలం అలంకానిపేటలో ఘటన

సద్దుల బతుకమ్మ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో ఈ ఘటన జరిగింది. బతుకమ్మ ఆడుతున్న ప్రాంగణంలో చీకటి యాకయ్య అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పండుగ పూట గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- అక్షరదర్బార్, నర్సంపేట

06

- షాద్ నగర్ కొందుర్గ్ లో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరింటికి శంకుస్థాపనకు ఏర్పాట్లు
- పర్యవేక్షించిన వివిధ శాఖల అధికారులు

తొలి దశ 28

రేపు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం వివిధ జిల్లాల్లోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. మొదటి దశలో చేపట్టనున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి అజిత్ రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంతరావులు కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ లో శాంతి కుమారి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రేపు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధిత జిల్లాల మంత్రుల, ఇంచార్జి మంత్రుల ఆమోదం పొందిన అనంతరం ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సవ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులందరినీ ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించాలని స్పష్టం చేశారు. ఈ స్కూళ్లను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న ఈ 28 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండవ దశలో ఇతర ప్రాంతాల్లో భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని సీఎస్ తెలిపారు.

- 28 నియోజక వర్గాలు ఇవే

తొలి దశ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్న 28 నియోజక వర్గాలను సీఎస్ ప్రకటించారు. వీటిలో కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్ చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, వరకాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట నియోజకవర్గాలు ఉన్నట్లు తెలిపారు. ఈ 28 నియోజకవర్గాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవి 6 ఉండటం గమనార్హం. ఈ ఆరు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల నిర్మాణానికి శుక్రవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం కోసం భూపాలపల్లి నియోజకవర్గంలో గణపురం మండలం మైలారం వద్ద ఇప్పటికే ఏర్పాట్లు జరిగినట్లు తెలిసింది.

వేడుకలను ప్రారంభిస్తున్న డీఆర్డీవో శాస్త్రవేత రాజబాబు

ఘనంగా నిట్ వార్షికోత్సవం

అక్షరదర్బార్, హన్మకొండ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఎఎల్సీ)లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షతన జరిగిన నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని డీఆర్డీవోలో శాస్త్రవేత్త, క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ రాజబాబు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐటీ వరంగల్‌కు 1959లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాది రాయి వేశారని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న 31 ఎన్ఐటీల్లో పురాతనమైనదన్నారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ అలుమ్ని అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల అసోసియేటెడ్ డీన్ ప్రొఫెసర్ టి.మహేష్ బృందం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అక్షరదర్బార్, వరంగల్: బిందు సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. గీసుగొండ మండలం మొగిలిచర్ల, ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లిలో క్షేత్రస్థాయిలో బిందుసేద్యం అమలు విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తక్కువ నీటితో అధిక దిగుబడులు తీసేందుకు బిందుసేద్యం ఎంతగానో ఉపకరిస్తోందని, ఈ పద్ధతి వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు అధిక ప్రయోజనాలు పొందవచ్చని సత్య శారద తెలిపారు. బిందుసేద్యం పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు పరికరాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సంగీతలక్ష్మి, ఉద్యానవన అధికారి తిరుపతి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ రామ్ చరణ్ తేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గౌడన్నలకు కాంగ్రెస్ చేయూత..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ

అక్షరదర్బార్, హన్మకొండ: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు, వృత్తి ఆధారిత కుటుంబాలకు అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమకొండ జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌడ సోదరులకు కాటమయ్య రక్షా కిట్ లను పంపిణీ చేశారు. పండుగ వేళ గౌడన్నలకు రక్ష కిట్ లను తన చేతుల మీదుగా పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రభుత్వం తరపున అందిస్తున్న కిట్ల వల్ల ప్రాణాపాయ స్థితుల నుంచి కాపాడటం చాలా ఆనందంగా ఉందన్నారు. గౌడ కులస్తులకు జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్రీపతి గోపి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, జిల్లా వెనుకబడిన శాఖ సూపరిటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా వెనుకబడిన శాఖ అధికారి రామ్ రెడ్డి, గౌడ కుల నేతలు, నాయకులు, ఎక్సైజ్ అధికారులుతదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి లక్ష్యం చేరుకోవాలి

పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని చేరుకోవాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ల, ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై హైదరాబాద్ నుంచి సచివాలయం నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓలు, మెప్మా బాధ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యక్తిగత, గ్రూప్ ల వారీగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యక్తిగత, గ్రూప్ లకు కలిపి 17,500 యూనిట్స్ ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత యూనిట్స్ లక్ష్యం 15,000 కాగా, రుణం రూ. 52.53 కోట్లు, గ్రూప్ యూనిట్స్ లక్ష్యం 2,500 కాగా, రూ. 500 కోట్ల రుణాలు లక్ష్యమని వెల్లడించారు. వ్యక్తిగత యూనిట్స్ ఇప్పటిదాకా 4,248 గ్రౌండింగ్ పూర్తి అయ్యాయని వివరించారు.

వివరణ ఇవ్వండి

- మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు
- నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో జారీ
- రెండో సాక్షి స్టేట్ మెంట్ రికార్డు చేసిన కోర్టు
- తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా

అక్షరదర్బార్, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఈ నోటీసులు జారీ అయ్యాయి. అనంతరం తదుపరి విచారణను నాంపల్లి కోర్టు ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. నాగార్జున దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా రెండో సాక్షి స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డ్ చేసింది. రెండు రోజుల క్రితమే నాగార్జున, మొదటి సాక్షి సుప్రియ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది. కొండా సురేఖ తన కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగార్జున నాంపల్లి ప్రత్యేక కోర్టులో పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల నాగచైతన్య, సమంత విడాకులపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన పరువునష్టం దావా వేశారు.

ఆయుధాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

అక్షర దర్బార్, కాటారం : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం ఎస్పీ మహాముత్తారం మండలకేంద్రం లోని పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, పిఎస్ కేసుల స్థితిగతులు, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ఎస్సై మహేంద్ర కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాటారం డిఎస్పీ జి. రామ్మోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జున రావు, ఎస్సై మహేంద్ర కుమార్, సీసీ ఫసియొద్దీన్, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం కూడలిలో జనసందోహం

కాటారంలో దసరా సందడి

షాపింగులకై తరలి వచ్చిన ప్రజలు
వ్యాపారులకు భలే గిరాకి
పండుగ కోసం పల్లెకు చేరిన జనం
కళకళలాడుతున్న గ్రామాలు

అక్షర దర్బార్,కాటారం : తెలంగాణ ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు మరింత ప్రాధాన్యత సంతరించుకున్న విషయం మనకు తెలిసిందే.తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి పెద్ద పండుగగా భావించే బతుకమ్మ,దసరా పండగకు పల్లె,పట్నం ప్రజలు తమ సొంతూళ్లకు చేరుకున్నారు.ఈ నేపథ్యంలో చిన్నా,పెద్ద,ఆడ,మగ అంతా ఏకమై షాపింగ్లు చేయడంలో నిమగ్నమవుతుండగా కాటారంలో బుధవారం దసరా సందడి నెలకొంది. మహదేవపూర్, మల్హర్,మహాముత్తారం, పలిమెల మండలాలకు కాటారం కేంద్రంగా ఉండడంతో అన్ని వ్యాపార దుకాణాలు కాటారంలో ఉంటాయి. గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో ఒక్కరోజు ముందే మహిళలు కాటారం బాట పట్టారు. దీంతో గతంలో కంటే ఈసారి కాటారంలో ఆయా షాపుల్లో మంచి వ్యాపారం జరిగినట్లయింది. ముఖ్యంగా వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణ షాపులు, కంగన్ హాల్స్ కిక్కిరిసిపోయాయి. ఏ షాపులో చూసినా జనమే కనిపిస్తుండగా ఆయా వ్యాపార యజమానుల మొహాల్లో చిరునవ్వులు కనిపించాయి.

బంతి పూలకు భలే గిరాకి

గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో బంతి పూలకు భలే గిరాకి ఏర్పడింది. కాటారం మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సుమారు 20 నుండి 30 వరకు పూల వ్యాపారులు బండ్లు పెట్టుకుని పూలు అమ్ముతున్నారు. అయితే గతంతో పోలిస్తే బంతి పూలకు ఈసారి మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆయా మండలాల ప్రజలు పూలకోసం కాటారం వస్తుండగా పూల వ్యాపారులకు సైతం మంచి వ్యాపారం జరిగినట్లుంది. పండించే తోట రైతులే అధిక రేటు కు అమ్ముతుండగా అక్కడి నుండి తెస్తున్న పూల బండ్ల వ్యాపారులు అంతకుమించి ప్రజలకు అమ్ముతుండడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. గతేడాది బంతిపూలు కిలో కు రూ.80 నుండి 100 వరకు విక్రయించగా ఈసారి 150 నుండి 200 పెంచేసి అమ్ముతుండడం గమనార్హం.

- పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి.
- రూ.8.5 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గండ్ర..
- ప్రగతిసింగారంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు కాంగ్రెస్ లో చేరిక..
- బతుకమ్మ విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

ప్రగతిసింగారంలో కాంగ్రెస్ లో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే గండ్ర

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, పరకాల : పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 23 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.8 లక్షల 50 వేల 500 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎస్సార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

ప్రగతిసింగారంలో కాంగ్రెస్ లోకి చేరికలు..

శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామం నుండి సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ముఖ్య నేత బోనపెల్లి రఘుపతి రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి ఆహ్వానించారు. కాగా, పార్టీలో చేరిన వారిలో ఎలమంచి జయపాల్ రెడ్డి(పీఏసీఎస్ డైరెక్టర్), బత్తిని కుమార్(వార్డు మెంబర్), డా.సమ్మయ్య, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

మాందారిపేటలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే.. మండలంలోని మాందారిపేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గా దేవి అమ్మవారిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. దుర్గా దేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

బతుకమ్మ విగ్రహాల ఆవిష్కరణ..

మండలంలోని మైలారం, ప్రగతిసింగారం, గట్లకానిపర్తి గ్రామాలల్లో బతుకమ్మ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గండ్ర

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పోయిరావమ్మా..

గంగమ్మ ఒడికి బతుకమ్మ

- తెలంగాణలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురం
- ఊరూవాడా మార్మోగిన ఉయ్యాల పాటలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో కన్నులపండువగా వేడుకలు
- హన్మకొండ పద్మాక్షమ్మ గుండంలో సందడి
- మహిళల ఆటపాటలతో కోలాహలం
- ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన సంబురాలు
- అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ
- తొమ్మిది రోజులపాటు వైభవంగా వేడుకలు

అక్షరదర్బార్, హన్మకొండ: పల్లెలను ప్రేమించి.. పువ్వులను పూజించి.. ప్రకృతిని ఆరాధించే... గొప్ప సాంస్కృతిక వైభవం సద్దుల బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఆడపడుచులంతా ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపమైన వేడుకలు అంబరాన్నంటాయి. ఈనెల 2న ఎంగిలపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా గురువారం ఊరూవాడా ఉయ్యాల పాటలతో మారుమోగాయి. పూల సింగిడి నేలకు దిగిందా అన్నట్టుగా.. పల్లెపట్నం బతుకమ్మలతో మురిసిపోయాయి. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ, ఏమేమి కాయప్పునే గౌరమ్మ అంటూ ఒకసారి, చిత్తూ చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ, ఒక్కేసి పువ్వేసి సందమామ అని, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో అంటూ ఇలా బతుకమ్మ పాటలతో ఊర్లన్నీ ఉర్రూతలూగాయి. అనంతరం పోయిరావమ్మా... అంటూ మహిళలు గంగమ్మ ఒడికి బతుకమ్మలను చేర్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబురం అత్యంత వైభవంగా కన్నులపండువగా సాగింది. హన్మకొండలోని పద్మాక్షమ్మ గుండంలో మహిళల కోలాహలం నెలకొంది. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. రాజధాని పూలవనంగా మారిపోయింది. బతుకమ్మలతో అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్ లో 3వ డివిజన్ లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు

పరకాల పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..

మహాదేవపూర్ ఆర్యవైశ్య సంఘంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

ఘనంగా సద్దుల బతుకమ్మ

ఆటపాటలతో మహిళల సంబరాలు

పోయిరావంటూ బతుకమ్మల నిమజ్జనాలు

అక్షర దర్బార్ నెట్ వర్క్ : జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుండి వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటల మధ్య ఆడ బిడ్డలు బతుకమ్మలతో తరలివెళ్లి ఒకచోట బతుకమ్మ నుంచి ఆటపాటలు నృత్యాలతో కోలాటాలు వేస్తూ సంబురాలు నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలందరూ డీజే సౌండ్ తో నృత్యాలు చేస్తూ సంతోషంగా ఆడి పాడారు. మళ్లీ రావే బతుకమ్మ అంటూ చెరువులలో నిమజ్జనం చేసి ఫలహారాలు పంచి పెట్టుకున్నారు. మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు బతుకమ్మ ఆట స్థలాల వద్ద ఏర్పాట్లు చేశారు.



06
గురువారం 10.10.2024
వరంగల్
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

రిలీవ్..

- ఏపీకి ఐదుగురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ ల బదలాయింపు
- ఈనెల 16లోగా రిపోర్ట్ చేయాలని కేంద్రం కీలక ఆదేశాలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి స్థాన చలనం

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఏపీ, తెలంగాణ కేడర్ విభజనపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు కీలక ఆదేశాలు జారీచేసింది. తెలంగాణలో తమ సర్వీసులు అందించాలనుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వారిని వెంటనే రిలీవ్ అయ్యి, ఏపీలో రిపోర్ట్ చెయ్యాలని ఆదేశించింది. తెలంగాణ క్యాడర్ కావాలని కేంద్రానికి వారు చేసిన విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించింది. ఈక్రమంలోనే కేంద్రం ఆదేశాలలతో ఐదుగురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్‌లను డీవోపీటీ రిలీవ్ చేసింది. ఈనెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆపేశించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, తెలంగాణ విద్యుత్ శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, ప్రశాంతి, ఐపీఎస్ అంజనీ కుమార్, అభిలాష్ బిష్టలకు తెలంగాణ క్యాడర్ కొనసాగించేందుకు కేంద్రం నిరాకరించింది. వెంటనే సొంత రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ అధికారులంతా.. ఏపీలో రిపోర్ట్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

ఆమ్రపాలి మార్క్..

ఒకవేళ ఈ అధికారలంతా ఏపీ క్యాడర్‌గా, తెలంగాణ నుంచి రిలీవ్ కావాల్సి వస్తే... ఇటీవలే GHMC కమిషనర్ అయిన ఆమ్రపాలి స్థానంలో మరో కమిషనర్‌ని నియమించాల్సి ఉంటుంది. ఐతే.. ఆమ్రపాలి.. ఇప్పటికే తన మార్క్ చూపిస్తున్నారు. ఇటీవల వినాయక నిమజ్జనోత్సవం కూడా బాగానే నిర్వహించారు. వానాకాలంలో నీరు రోడ్లపై నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్లను కూడా ఎప్పటికప్పుడు పూడ్చి వేయిస్తున్నారు. చెత్తను తరలించే విషయంలోనూ యాక్టివ్‌గానే అన్నీ జరిపిస్తున్నారు. ఇప్పుడు కేంద్రం నిర్ణయంతో.. తెలంగాణలో ఈ అధికారులు అందించే సేవలను ఇతర అధికారులు అందించాల్సి వస్తే.. అందుకు కొంత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాల మధ్య రతన్ టాటా అంత్యక్రియలు
- పారిశ్రామిక దిగ్గజం పార్థివదేహం ఎదుట ప్రణమిల్లిన జనం
- సినీ, రాజకీయ రంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తల నివాళి

అక్షరదర్బార్, ముంబయి : దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముంబయి వర్లి శ్మశాన వాటికలో ముగిశాయి. నగరంలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారంరాత్రి 11.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈవార్తతో ప్రపంచవాప్తంగా ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. మహారాష్ట్ర కోల్బాలోని నివాసానికి రతన్ టాటా పార్థివదేహం తరలించారు. సినీ. రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పార్థివదేహం సందర్శించి నివాళులర్పించారు. తరువాత పార్థివదేహాన్ని ఎన్‌సీపీఏ లాన్కు తీసుకువెళ్లారు. వేల సంఖ్యలో వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు అక్కడకు చేరుకుని టాటాకు ఘన నివాళులు అర్పించారు. టాటా సంస్థల ఉద్యోగులు తరలివచ్చి కన్నీటి నివాళులు అర్పించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రతన్ టాటా అంతిమయాత్ర ప్రారంభమైంది. రతన్ టాటా అంత్యక్రియలను మహారాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించింది. ముంబయి వర్లి శ్మశాన వాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఆయన మృతి కారణంగా మహారాష్ట్ర ప్రభుత్వం సంతాప దినం ప్రకటించింది. దేశవ్యాప్తంగా విషాధఛాయలు అలుముకున్నాయి.

చికిత్స చేస్తున్న వైద్యులు

ఎంజీఎంలో బ్రాంకోస్కోపీ చికిత్స

ఊపిరితిత్తుల్లో చేరిన పల్లి గింజను తొలగించిన వైద్యులు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఎంజీఎం దవాఖాన వైద్యులు మరో ఘనత సాధించారు. ప్రమాదవశాత్తు ఊపిరితిత్తుల్లో చేరిన పల్లి గింజను బ్రాంకోస్కోపీ చికిత్స ద్వారా తొలగించి చిన్నారి ప్రాణాలు కాపాడారు. ములుగు జిల్లా మల్లంపేటకు చెందిన రెండేళ్ల బాలుడు సద్దాం హుస్సేన్ దగ్గు, ఆయాసంతో బాధపడ◌తున్నాడు. ఈనెల 9న చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు వచ్చారు. పరీక్షించిన వైద్యులు బాలుడి ఊపిరితిత్తుల్లో పల్లీ గింజ ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలోనే గురువారం బ్రాంకోస్కోపీ చికిత్స ద్వారా ఊపిరితిత్తుల్లో చిక్కుకున్న పల్లి గింజను తొలగించారు. డాక్టర్ వెంకటరత్నం నేతృత్వంలో వైద్యుల బృందం ఈ ఆపరేషన్ నిర్వహించగా, కుటుంబ సభ్యులు డాక్టర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

అడ్వాలపల్లిలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

గోధుమ నారుకు నిష్టతో యువతుల పూజలు

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని అడ్వాలపల్లి గ్రామ గిరిజన తండాలో గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాజ్ నాయక్ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పెళ్ళిడుకొచ్చిన గిరిజన యువతులకు ఇది ఎదురుచూస్తున్న వేడుక నచ్చిన వరుడు రావాలని కోరుతూ యువతులు భక్తితో కొలిచే తీజ్ వేడుకలతో ఆయారే తీజ్ అంటూ ఘనంగా నిర్వహించారు. తరతరాలుగా గిరిజనులు తమ సంస్కృతి, సంప్ర దాయాలను పాటిస్తూ తీజ్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. బంజారాల భాషలో తీజ్ అంటే 'ఎర్రని ఆరుద్ర, నారు' అనే రెండు అర్థాలు. తండాలోని పెద్దమనిషి ఇంటి ఎదుట ప్రత్యేకంగా పందిరిని ఏర్పాటు చేస్తారు. పెళ్లికాని యువతులు తండా పెద్దమనిషి సహాయంతో బుట్టలు కొనుగోలు చేసి ప్రత్యేకంగా అలంకరించి, మట్టి పోసి గోధుమలు చల్లుతారు. ఈ బుట్టలను పందిరిపై ఉంచుతారు. తండా లోని యువతులు బుట్టలపై రోజుకు మూడు సార్లు నీరు పోస్తుంటారు. ఇలా తొమ్మిది రోజులు కొలిచే క్రమంలో యువతులు రోజుకు ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తారు.

ఆడిపాడుతున్న యువతులు

గోధుమ నారుతో ఊరేగింపు..

తొమ్మిదో రోజు మొలకెత్తిన గోధుమనారు బుట్టలతో యువతులు ఊరేగింపు నిర్వహిస్తారు. అంతకు ముందు సేవాలాల్, జగదాంబ అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. పందిరిపై ఉన్న గోధుమనారు బుట్టలను కిందికి దింపి తండా కూడలి వద్ద పెట్టి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తుంటారు. అనంతరం ఆ బుట్టలను నెత్తిపై పెట్టుకొని ఊరేగింపుగా సమీపంలోని వాగు వద్దకు వెళ్లి నిమజ్జనం చేస్తారు. ప్రతీ మంగళవారం తండాల్లో తీజ్ విమి వేడుకలు నిర్వహించాలని గిరిజన పెద్దలు నిర్ణయించారు.

బతుకమ్మ వేడుకల్లో అపశృతి

విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

అలంకానిపేటలో ఘటన

అక్షరదర్బార్, నర్సంపేట : సద్దుల బతుకమ్మ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో ఈ ఘటన జరిగింది. బతుకమ్మ ఆడుతున్న ప్రాంగణంలో చీకటి యాకయ్య అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పండుగ పూట గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామచంద్రపురం గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు